www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 23 ఆగస్టు 2023
5
ఏలూరు



విద్యుత్ బిల్లుల్లో ఆన్‌లైన్‌లో చెల్లించండి

ప్రజాశక్తి – ఏలూరు

విద్యుత్ వినియోగదారులు కరెంటు బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించడానికి వివిధ రకాల ఆన్‌లైన్ సేవలను విద్యుత్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆపరేషన్ సర్కిల్ ఏపిఈపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లు చెల్లించేందుకు క్యూలైన్‌లో నిలబడి విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ఉండేందుకు ఆన్‌లైన్ సేవలను అందరికీ సులభపద్ధతిలో అందుబాటులోకి తెచ్చామన్నారు. గూగుల్ పే, ఫోన్ పే, పేటిఎం, ఎపిఇపిడిసిఎల్ వెబ్‌సైట్, ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్, ఆటో పే టచ్ బ్యాంక్ అకౌంట్స్, పే యు, మీ సేవ, సిఎస్ సి సెంటర్స్, ఎనీ టైం పేమెంట్ సెంటర్స్, బిల్ డెస్క్, ఇన్ స్టా పే, పేమెంట్ టచ్, ఎలక్ట్రిసిటీ క్యూఆర్ కోడ్ ఆన్ సిసి బిల్స్ వంటి ఆన్ లైన్ విధానాల్లో బిల్లులను సురక్షితంగా చెల్లించవచ్చాన్నారు.

మళ్లీ వరద భయం..!

పెరుగుతున్న గోదావరి ఉధృతి
కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రజల ఆందోళన
భద్రాచలం వద్ద 32 అడుగులకు నీటిమట్టం
పొంగుతున్న గుండేటి, ఎద్దువాగులు
24 గ్రామాలకు రాకపోకలు బంద్
వరద పెరిగితే పత్తి, మిర్చి రైతులకు కోలుకోలేని దెబ్బ

కుక్కునూరు – దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వేను ముంచెత్తిన వరద

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

గోదావరికి వరద ఉధృతి పెరుగుతుండటంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను మళ్లీ వరద భయం వెంటాడుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. మంగళవారం నాడు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 32 అడుగులకు చేరింది. దీంతో ఎద్దువాగు, గుండేటి వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎద్దువాగు పొంగడంతో వేలేరుపాడు మండలంలోని బోళ్లపల్లి, చిగురుమామిడి మధ్య ఉన్న కాజ్‌వేపై వరద నీరు చేరింది. దీంతో కొయిదా, కట్కూరు, కాకినూరు, బోళ్లపల్లి, టేకూరు వంటి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే మునగడంతో బెస్తగూడెం, సీతారామపురం, నెమలిపేట, గుమ్మంబోరు వంటి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాలకు వెళ్లాలంటే 15 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలను వరద భయం వెంటాడుతోంది. ఈసారి వరద వస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జులై నెలలో వరద వచ్చి తగ్గడంతో రైతులంతా వేలాది ఎకరాల్లో పత్తి, మిర్చి సాగు చేశారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు వరదొస్తే పంటంతా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోయి తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. దీంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆ పొలాలు ప్రాజెక్టు ముంపులో ఉన్నవని కావడంతో పంట నష్టపరిహారం కూడా ప్రభుత్వం అందించడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

15 రోజుల వ్యవధిలో మళ్లీ వరద

గడిచిన జులై 20వ తేదీ తర్వాత గోదావరికి వరద పోటెత్తింది. దాదాపు 45 గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. ఎక్కడికక్కడే రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో 13,764 మంది వరద బాధితులుగా మారి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. రెండు మండలాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4,275 మందిని తరలించారు. మిగిలిన 9,589 మంది కొండలు, గుట్టలకు చేరి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కటిక చీకట్లో కాలం గడిపారు. ప్రభుత్వం నిత్యావసర వస్తువులు వంటివి అందించినా తాగునీరు వంటి సమస్యలతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు ఐదో తేదీ వరద తగ్గుముఖం పట్టింది. దీంతో పునరావాస కేంద్రాలకు చేరిన బాధితులంతా గ్రామాలకు చేరి ఇళ్లను బాగు చేసుకున్నారు. పట్టుమని 15 రోజులు గడవకముందే మళ్లీ గోదావరి వరద పెరుగుతుండటం అక్కడి ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వరద పెరిగితే మళ్లీ పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పోలవరం ప్రాజెక్టులో భాగమైన కాఫర్ డ్యామ్‌ను ముందుగానే నిర్మించడంతో చిన్నపాటి వరదకు సైతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. 2022 వరదలకు దాదాపు 95 గ్రామాలు ముంపుబారిన పడగా 20 వేల మందికిపైగా వరద బాధితులుగా మారి పునరావాస కేంద్రాలకు చేరారు. ఈ ఏడాది జులైలో వచ్చిన వరదకు అదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మాత్రం ముంపుగ్రామాలకు పునరావాస ప్యాకేజీ ఇచ్చి తరలించడం లేదు. దీంతో ప్రతియేటా రెండు మండలాల్లోని ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ తల్లడిల్లుతున్నారు.

మళ్లీ కాజ్‌వేను ముంచెత్తిన వరద

కుక్కునూరు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి నీటిని దిగువకు వదలడంతో గోదావరికి వరద క్రమంగా పెరుగుతోంది. మంగళవారం కుక్కునూరు-దాచారం మధ్య గల గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వేపైకి వరద నీరు చేరింది. దీంతో వాగు అవతలివైపు గల దాచారం, బెస్తగూడెం, నెమలిపేట, సీతారామపురం, అరవపల్లి, గుండంబోరు, ఉప్పరమద్దిగట్ల వంటి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత నెలలో వచ్చిన గోదావరి వరదలకు నెలరోజుల పాటు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో 12 గ్రామాల ప్రజలు, రైతు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ చుట్టూ 15 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరద పూర్తిగా తగ్గడంతో 20 రోజులుగా రాకపోకలు కొనసాగుతున్నాయి. మళ్లీ వరద కాజ్‌వేను ముంచడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమవ్వడంతో గోదావరి వరదలు రావనే నమ్మకంతో మండలంలోని రైతులు పత్తి, మిర్చి పంటల సాగుపనిలో నిమగ్నమయ్యారు. గోదావరికి వరద క్రమంగా పెరుగుతుండటంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. గతనెలలో వచ్చిన గోదావరి వరదలకు ఇళ్లను ఖాళీ చేసి రావాలని పునరావాస కేంద్రంలో తలదాచుకున్న గొమ్ముగూడెం, బెస్తగూడెం, రేపాకగొమ్ము గ్రామ వరద బాధిత కుటుంబాలు 10 రోజుల క్రితం ఎవరి ఇళ్లకు వారు చేరుకున్నారు. గోదావరి వరద పెరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

భూఆక్రమణదారుల పేర్లు బహిర్గతం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి పేర్లు బహిర్గతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం దెందులూరు డిప్యూటీ తహశీల్దార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని పేదలకు భూమి పంచాలని కోరారు. అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారి పేర్లు బహిర్గతం చేయాలని, గ్రామ సచివాలయం వద్ద వారి లిస్టులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఐదు దశలుగా చేపట్టిన భూ సర్వేలన్నీ భూస్వాములకు అనుకూలంగా జరుగుతున్నాయని విమర్శించారు. గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు అవకతవకలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఐదు దశల సర్వేల్లో భాగంగా ముందుగా ఆ గ్రామంలో ఉన్న అసైన్డ్ సీలింగ్, ప్రభుత్వ భూములు ఎవరెవరు ఎంత ఆక్రమించారు, అనుభవిస్తున్నారు అనేది బహిర్గతం చేయాలని కోరారు. ఇప్పటికే మండలంలో పోతునూరులో 400 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. దోసపాడులో అసైన్డ్, సీలింగ్, గయ్యాల భూములు 300 ఎకరాలు భూస్వాములు ఆక్రమించుకున్నారన్నారు. కొవ్వలిలో 250 ఎకరాలను భూస్వాములు అన్యాక్రాంతం చేసి అనుభవిస్తున్నారని తెలిపారు. దెందులూరు మండల కేంద్రంలో సుమారు 60 నుండి 70 ఎకరాల ప్రభుత్వ భూమి స్థానిక భూస్వాముల చేతుల్లో ఉందని తెలిపారు. ఈ భూములన్నీ పేదలకు చెందిన భూములేనన్నారు. వీటిపై సర్వహక్కులూ పేదలకు ఇవ్వాలని, వారికే ఉంటాయన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూమిలేని పేదలకు ఈ భూములు పంచాలని డిమాండ్ చేశారు. దోసపాడు వంటి గ్రామాల్లో ఇప్పటికే దళితులు, పేదలు ఏడాది నుండి పోరాడుతున్న రెవెన్యూ శాఖ అధికారులు మొద్దునిద్రపోతున్నారని మండిపడ్డారు. భూస్వాములిచ్చే లంచాలు మింగే పేదలకు, దళితులకు అన్యాయం చేస్తున్నారని వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు జాన్‌రాజు, రాజు, నాగేంద్ర, లక్ష్మి, ఏసురత్నం పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : ఎస్‌పి

టి.నరసాపురంలో మొక్కనాటిన ఎస్‌పి

ప్రజాశక్తి – టి.నరసాపురం

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, వాటికి ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్‌పి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో మొక్కను నాటారు. పలు కేసుల దర్యాప్తును పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. వ్యసనపరులకు, రౌడీషీటర్లకు ప్రతీవారం కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. నేరచరిత్ర ఉన్న వారి జీవన విధానాలపై నిఘా ఉంచా లన్నారు. దిశా యాప్‌పై విద్యార్థులకు కల్పించాలని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా పోలీసులకు కేటాయించిన జాబ్ చార్టు తూచా తప్పకుండా నిర్వర్తించాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళా పోలీసు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం డిఎస్‌పి శ్రీనివాసులు, జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వ రరావు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

జీలుగుమిల్లి : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలుంటాయని ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయాన్ని, జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌ను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో భూ తగాదాలపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా అంతర్‌రాష్ట్ర సరిహద్దు మండలం కావడంతో జాతీయ రహదారి గుండా గంజాయి, మద్యం, గుట్కా వంటి అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలవరం డిఎస్‌పి ఎ.శ్రీనివాసులు, సిఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వి.చంద్ర శేఖర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

మాట్లాడుతున్న తాతారావు

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ బి.తాతారావు పేర్కొన్నారు. మండల సమాఖ్యలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలో క్రిమిసంహారక మందులు వాడకుండా ప్రకృతిసిద్ధమైన ఎరువులను వాడటం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ పంటల వల్ల కొన్నిరకాల జబ్బులను దరికి రాకుండా చూసుకోవచ్చని రైతులకు సూచించారు. అందుకు రైతులందరూ సహజ సిద్ధమైన పద్ధతులతో పంటలను పండించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి నాగేశ్వరరావు, ఎపిఎం ఎ.రామారావు, అడిషనల్ డిపిఎం మహబూబ్ వలి, ఎఎంసి డైరెక్టర్ బి.శ్రీనివాస్, మండల ఐకెపి సిబ్బంది, విఓఎలు పాల్గొన్నారు.

సమస్యలు సత్వర పరిష్కారానికి కార్యాచరణ : ఆళ్ల నాని

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల సత్వర పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని అధికారులను ఆదేశించారు. స్థానిక మూడు, నాలుగు, ఐదు డివిజన్లలో ఇటీవల నిర్వహించిన 'గడపగడపకూ మన ప్రభుత్వం'పై సమీక్షా సమావేశం ఆళ్ల నాని అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలని, అర్హత కలిగి కూడా పథకాలు అందని వారికి పథకాలు అందేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇంటి పట్టాల మంజూరు, రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల విభజన, సదరం సర్టిఫికెట్లు, పెన్షన్లు, పారిశుధ్య సమస్యలు తదితర వినతులను సత్వరం పరిష్కరించాలన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర ఇంజినీరింగ్ పనులకు సంబంధించి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ వెంకటకృష్ణ, డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, పలువురు కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను విధిగా సమీక్షించాలి : సబ్ కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి – ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రభుత్వ పథకాలను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ కూచిపూడి సాయిరామ్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరుడు చిన్నఅంజయ్య మృతి

ఆగిరిపల్లి: మండల పరిధిలోని చిన్నాగిరిపల్లికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు జంగం చిన్నఅంజయ్య(60) మంగళవారం రాత్రి అనారోగ్యంతో ఆయన స్వగృహంలో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు సందర్శించి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలిపారు.

దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు వడ్డీతో చెల్లించాలి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు వడ్డీతో రైతులకు చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఎం.నాగులపల్లిలో రైతుసంఘం నాయకులు పర్యటించి దొండ పందిళ్లను పరిశీలించారు. దొండ, ఇతర కూరగాయల సాగు సమస్యలను రైతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరా దొండ పందిరికి రూ.2.50 లక్షలకుపైగా పెట్టుబడి అవుతోందన్నారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా సబ్సిడీ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పందిళ్లకు సబ్సిడీ ఇస్తారో లేదో స్పష్టత లేక రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. మూడేళ్లుగా వైరస్ తెగుళ్లు వచ్చి పందిళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. అప్పులు చేసి పందిళ్లు వేస్తే సబ్సిడీ బకాయిలు రాకపోవడం వల్ల అప్పులకు వడ్డీలు పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు వడ్డీతో రైతులకు చెల్లించి ఆదుకోవాలని కోరారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. కూరగాయల రైతుల సంఘం నాయకులు కట్టా భాస్కర్‌రావు మాట్లాడుతూ కూరగాయల రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కాలంలో ఐదు ఎకరాల్లోపు రైతులకు 90 శాతం సబ్సిడీపైన, ఐదు ఎకరాలు దాటిన వారికి 75 శాతం సబ్సిడీపై, ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా డ్రిప్ ఇరిగేషన్ పథకం అమలు జరిగిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పథకం అమలు చేయకపోవడం వల్ల రైతాంగ ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టి.మురళీ, ఎలమర్తి శ్రీనివాసరావు, టి.భాస్కరరావు, ఎ.లక్ష్మణరావు, కె.సురేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న రోషన్‌కుమార్

కార్యకర్తలకు అండగా టిడిపి

ప్రజాశక్తి – చింతలపూడి

కార్యకర్తలకు, నాయకులకు టిడిపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చింతలపూడి నియోజకవర్గ టిడిపి యువనాయకులు సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఇటీవల ఓ ఘటనలో గాయపడి చింతలపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగపాలెం మండలం పాశ్చానగరానికి చెందిన టిడిపి కార్యకర్త తుమ్మళ్లపల్లి వంశీని రోషన్‌కుమార్ పరామర్శించారు. ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. అనంతరం రోషన్‌కుమార్ మాట్లాడుతూ అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వైద్య ఖర్చులకు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవా, నాయకులు శాఖముడి వెంకటేశ్వరరావు, తొమ్మండ్రు మల్లయ్య పాల్గొన్నారు.

20 ఏళ్లు కష్టపడితే.. 50 ఏళ్ల భవిష్యత్తు

ఏలూరు స్పోర్ట్స్ : విద్యార్థులు 20 ఏళ్లపాటు కష్టపడి చదివితే జీవితంలో మరో 50 ఏళ్లు సుఖసంతోషాలతో గడిపే అవకాశం ఏర్పడుతుందని ఏలూరు త్రీటౌన్ సిఐ కోమాకుల శివాజీ సూచించారు. ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు త్రీటౌన్ పరిధిలో కళాశాలల వద్ద ఆకతాయిగా తిరుగుతున్న విద్యార్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు శ్రమించాలని, పిల్లలపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయొద్దని హితవుపలికారు. చదువుకోవాల్సిన సమయంలో ఏదైనా వివాదాల్లో చిక్కుకుంటే పోలీసు కేసు నమోదైతే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని, ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులవుతారని, విదేశాలకు వెళ్లేందుకు కేసులు ప్రతిబంధకాలుగా మారతాయని అవగాహన కల్పించారు. సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగాలు సాధించి, ఉన్నతంగా జీవించేలా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు.

ప్రతి అర్హునికీ సంక్షేమ పథకాలు చేరాలి

ప్రభుత్వ భవనాలు వచ్చేనెలాఖరుకు పూర్తిచేయండి

కైకలూరు నియోజకవర్గ సమీక్షలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్

ప్రజాశక్తి – ఏలూరు

పేదల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ, జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం కైకలూరు నియోజకవర్గంలో అమలు జరుగుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, కైకలూరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జిమంత్రి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితో బాధ్యతాయుత పరిపాలన అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం ద్వారా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో మంజూరైన 79 గ్రామసచివాలయ భవనాలు, 45 రైతు భరోసా కేంద్రాలు, 57 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనుల్లో ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని మిగిలిన వాటిని వచ్చేనెలాఖరులోపు పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ కైకలూరులోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో అంబేద్కర్ భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని విశ్వరూప్‌ను కోరారు. ఇప్పటికే ఇందుకోసం ఏలూరు పార్లమెంటు సభ్యులు రూ.30 లక్షలు మంజూరు చేశారన్నారు. కైకలూరు సిహెచ్‌సిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముదినేపల్లి, కైకలూరు తదితర ప్రాంతాల్లో కొండదొరలు శ్రీకాకుళం నుంచి కూలి పనుల కోసం వచ్చారని, వారికి ఎస్‌టి కుల ధృవీకరణ పత్రాలు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే దీనిపై కలెక్టర్ కూడా కమిటీ కుడా వేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 27 సొసైటీలకు కమిషన్ విడుదల చేయాల్సిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో ఎస్సీ ఏరియాల్లో స్మశాన వాటికలకు కైకలూరు నియోజకవర్గం పరిధిలో భూమి కేటాయించాలని మంత్రి దష్టికి తీసుకువచ్చారు. భూమి రీ సర్వేపై కొంతమంది కావాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దీనికి రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. 22ఎకి సంబంధించి సత్వర పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని తద్వారా రిజిస్ట్రేషన్లకు సులభతరమవుతుందన్నారు. నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరుకున్న పది పశువుల ఆసుపత్రులను పునరుద్ధరించాలని, ఇందుకు రూ.నాలుగు కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఈ నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి మంత్రిని ఆయన కోరారు.

కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను వచ్చేనెలాఖరుకు పూర్తిచేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు స్థానిక శాసన సభ్యుల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. ఈ భవనాల నిర్మాణానికి అవసరమైన నిర్మాణ సామగ్రితోపాటు బిల్లులు త్వరితగతిన ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఇప్పటికే 300 ఇళ్లు పూర్తిచేశామని, మరో 800 ఇళ్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 101 గ్రామాలకు గాను 91 గ్రామాల్లో ఒఆర్ఐ మ్యాప్స్ వచ్చాయని, 19 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందన్నారు. 47 గ్రామాల్లో తుది ఆర్ఒఆర్ పూర్తయిందన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో ఫేజ్-1, 90 రోజుల్లో ఇళ్ల స్థలాల పంపిణీలో భాగంగా ఇప్పటి వరకూ 9,985 మందికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీకి 5115 మందికి ప్రభుత్వ భూమి, 4870 మందికి భూసేకరణ చేసి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

పేటిఎం మిషన్ ద్వారా డ్వాక్రా రుణాల చెల్లింపు

జిల్లాలో ప్రయోగాత్మకంగా ఉంగుటూరు మండలంలో అమలు

ప్రజాశక్తి – ఉంగుటూరు

స్త్రీనిధి – మహిళా బ్యాంకు వారు నూతనంగా ప్రారంభించిన పేటియం మిషన్ ద్వారా రుణవాయిదాలు చెల్లించే విధానం రాష్ట్రంలో ప్రవేశపెట్టారు. దీనిని ప్రయోగాత్మకంగా ఉంగుటూరు మండలంలో తొలిసారిగా అమలు చేస్తున్నారని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. ప్రస్తుతం స్త్రీనిధి రుణం తీసుకున్న సభ్యురాలు రుణవాయిదాలను స్వయం సహాయక సంఘాల లీడర్ ద్వారా గ్రామ సమాఖ్యకు చెల్లిస్తున్నారు. గ్రామ సమాఖ్య ఖాతా నుండి గ్రామసంఘం అధ్యక్షుల ద్వారా విఒఎ స్త్రీనిధి ఖాతాకు స్త్రీనిధి రుణవాయిదాలు బదిలీ చేస్తున్నారు. ఈ మొత్తాలు స్వయం సహాయక సంఘాలు చెల్లించిన వివరాలు విఒఎ ద్వారా సీసీలు తీసుకుని తమ లాగిన్‌లో సర్దుబాటు చేస్తున్నారు. దీని వల్ల స్వయం సహాయక సంఘాలు విఒ ఖాతాలో చెల్లించటం వల్ల బ్యాంకు నిబంధనల ప్రకారం స్వయం సహాయక సంఘాలకు ఛార్జీలు పడటం, బ్యాంకుకు వెళ్లి కట్టాల్సి వచ్చి సమయం వృథా అవడం, స్వయం సహాయక సంఘాలు విఒఎలకు, విఒ నాయకులకు నగదు రూపంలో చెల్లించడం వల్ల వీటిలో కొంత మొత్తాలు లెక్కలోకి రాకపోవడం, స్వయం సహాయక సంఘాలు విఒ ఖాతాల్లో సమయం ప్రకారం రుణ వాయిదాలు చెల్లించినప్పటికీ అదే విఒలో మిగిలిన స్వయం సహాయక సంఘాలు రుణ వాయిదాలు లేటుగా చెల్లించినట్లయితే వడ్డీలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో స్త్రీనిధి-మహిళా బ్యాంకు వారు నూతనంగా ప్రారంభించిన పేటిఎం మిషన్ ద్వారా రుణ వాయిదాలు చెల్లించే విధానం రాష్ట్రంలో ఉంగుటూరులో ప్రవేశపెట్టబడింది. ఈ మిషన్‌నందు విఒఎ తన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి తన గ్రామసంఘంలో స్త్రీనిధి రుణాలు తీసుకున్న సంఘ సభ్యులు సులభ పద్ధతిలో రుణాలు చెల్లించేందుకు ఏర్పాటు చేయబడింద. దీని ద్వారా ముందుగా సంఘం ఐడి నెంబర్ నమోదుచేయగా ఆ సంఘానికి సంబంధించిన స్త్రీనిధి రుణ సభ్యుల వివరాలు చూపుతుంది. సభ్యులు చెల్లించాల్సిన వాయిదా మొత్తాలు, అప్పు నిల్వ చూపిస్తుంది. ఈ పేటిఎం మిషన్‌లో వాయిదా మొత్తాలు చెల్లించేందుకు డెబిట్, క్రెడిట్, ఫోన్ పే, గూగుల్‌పే కార్డుల స్కాన్, క్యూఆర్ కోడ్‌ల ద్వారా నేరుగా సంఘ సభ్యులు స్త్రీనిధి ఖాతాకు సులభతరంగా జమ చేయెచ్చు. దీనివల్ల స్వయం సహాయక సంఘాల రుణ వాయిదాలు చెల్లింపునకు బ్యాంకుకు వెళ్లే సమయం ఆదా అవుతుంది. నగదు లావాదేవీలు ఎలాంటి అవకతవకలు పాల్పడటానికి అవకాశం ఉండదు. సభ్యులకు రుణ వాయిదాల మొత్తాలు తెలిసేలా పారదర్శకంగా ఉంటుంది. సంఘ సభ్యులకు వాయిదా చెల్లించిన వెంటనే రశీదు పొందొచ్చును. ఇప్పటివరకూ ఉంగుటూరు మండలంలో 54 గ్రామసమాఖ్యల్లో, 750 స్వయం సహాయక సంఘాలకు రూ.18.24 కోట్లు రుణాలుగా ఇవ్వగా, నేటికీ అప్పునిల్వ రూ.10.09 కోట్లుగా ఉంది. సెప్టెంబర్ నుండి ఈ పద్ధతి ద్వారా అన్ని సంఘాల్లో అమలయ్యేలా మండల, గ్రామ సమాఖ్య స్థాయిలో అన్ని సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి, ఉంగుటూరు మండలంలోని విఒలలో ప్రతినెలా 15వ తేదీలోపు పూర్తయ్యేలా, ఇదే పద్ధతిని రానున్న రోజులలో అన్ని మండలాల్లో అమలయ్యేలా తగు చర్యలు తీసుకుంటున్నామని పీడీ తెలిపారు.

వాలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో ఖాళీగా ఉన్న ఆరు గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా అంబరుపేట గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న నాలుగు పోస్టులను బిసి-ఎ(జనరల్), బిసి(బి)జనరల్, బిసి(డి)జనరల్, ఒసి, జనరల్ సామాజిక తరగతులకు, పోలసానిపల్లిలో ఖాళీగా ఉన్న ఒక పోస్టును ఒసి జనరల్కు, గుండుగొలనులో ఒక పోస్టును బిసి(డి) జనరల్కు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తికలవారు యుఆర్ఎల్ విధానం ద్వారా ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 29వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించి, ఖాళీలు భర్తీ చేస్తామని ఎంపిడిఒ తెలిపారు.

పోలవరం : మండలంలోని పోలవరం, కొరుటూరు గ్రామపంచాయతీలలో 3 గ్రామ వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను తెలిపారు. కొరుటూరు 1(ఎస్టి మహిళ), పోలవరం 3(ఒసి మహిళ), పోలవరం 1(ఎస్టి మహిళ), మూడు వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మూడు వాలంటీర్ పోస్టుల సంబంధించి పదవ తరగతి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు వయసు నిండిన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నూజివీడులో కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాలలో రోజురోజుకీ పెరిగిపోతున్న వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలు, సందులలో కాక ప్రధాన రహదారుల వెంబడి వీధి కుక్కల సంఖ్య పెరిగిపోతుండటంతో పట్టణ ప్రజలు వాపోతున్నారు. నిత్యావసరాలు, కూరగాయలు తెస్తున్న వెంబడించి సంచులను లాగేస్తున్నాయని, కొత్త వారి వెంటపడి కరుస్తున్నాయని ప్రజలు భయపడుతున్నారు. తక్షణమే మున్సిపాలిటీ వారు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పిఎసిఎస్ నూతన భవన నిర్మాణానికి కెడిసిసిబి ఛైర్పన్ తాతినేని పద్మావతి, ఎంఎల్ఎ మేక వెంకటప్రతాప్ అప్పారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. రైతులకు పంట రుణాలే కాకుండా అనేక విధాలుగా పలు పథకాల్లో రుణాలను అందజేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

అనారోగ్యానికి గురైన బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధిని ఎంఎల్ఎ అందజేశారు. మంగళవారం నూజివీడు ఎంఎల్ఎ కార్యాలయంలో చాట్రాయి మండలం బూరుగుగూడెం గ్రామానికి చెందిన పట్టణ పుల్లయ్య(54) గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా రూ.4 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధిని బాధిత కుటుంబానికి అందజేశారు. రాష్ట్ర సహకార సంఘం యూనియన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - మండవల్లి

రౌడీ షీటర్లు, పాత నేరస్తులు గ్రామాల్లో సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేకుంటే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు కైకలూరులోని సిఐ కార్యాలయంలో మండలానికి చెందిన రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లపై నిగా ఉంచాలని, అల్లర్లు సృష్టించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు వేరే కేసుల్లో తలదూర్చకూడదన్నారు. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న గొడవల్లో ప్రమేయం లేకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఐ టి.రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సారా విక్రేతలు అరెస్టు

చింతలపూడి : సారా అమ్ముతున్న వారిని పట్టుకున్నట్లు చింతలపూడి ఎస్ఇబి సిఐ సాయిస్వరూప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో పోతునూరు గ్రామం, రాఘవాపురం గ్రామాలలో చింతలపూడి సబ్ సిబ్బంది దాడులు జరిపారు. పోతునూరు గ్రామానికి చెందిన చేకు ఆంజనేయులు(గతంలో రెండు కేసులలో ముద్దాయి) 5 లీటర్ల సారా, రాఘవాపురం గ్రామానికి చెందిన ఇంజమూడి రాంబాబు(గతంలో మూడు కేసులలో ముద్దాయి) 5 లీటర్ల సారాను అమ్ముతుండగా అరెస్టు చేసి, ఇద్దరిని రిమాండ్కి పంపినట్లు తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లిన మృతదేహం లభ్యం

భీమడోలు : విద్యుత్ సబ్స్టేషన్ పక్కన ఉన్న పుంత రోడ్డు సమీపంలోని పొదలలో కుళ్లిన మృతదేహం మంగళవారం బయటపడింది. చనిపోయిన వ్యక్తి పొలసానిపల్లి గ్రామానికి చెందిన మిద్దె సతీష్(40)గా గుర్తించారు. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మిద్దె సతీష్ భీమడోలు జంక్షన్లోని చికెన్ షాప్లో పనిచేసేవాడు. అతని భార్య లిక్సిల్ కంపెనీలో క్రింది స్థాయి సిబ్బందిగా పనిచేస్తున్నారు. సతీష్కు విపరీతంగా మద్యం తాగే అలవాటు ఉంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరిగేవి. ఆదివారం సాయంత్రం చికెన్ షాప్లో పని పూర్తైన తర్వాత విపరీతంగా మద్యం సేవించిన సతీష్ ఇంటికి వచ్చే క్రమంలో, విద్యుత్ స్టేషన్ సమీపంలో పొదల్లో పడిపోయి ఉంటాడని, బహుశా డిహైడ్రేషన్ కారణంగా అతను చనిపోయి ఉండవచ్చునని అతని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన భీమడోలు ఎస్ఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నాటుసారా తయారీ : ఇద్దరు వ్యక్తులు అరెస్టు

ఆగిరిపల్లి : ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండల పరిధిలోని వడ్లమాను అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గండికోట విజయ్కుమార్, గుర్రం వెంకటేశ్వరరావులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా తయారీకి సిద్ధంగా వున్న 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్కు తరలించినట్లుగా ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నూజివీడు రూరల్ : వెంకటాద్రిపురం గ్రామంలో రెండు బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన గొల్ల నాగరాజు(38) అనే వ్యక్తికి గాయాలు కావడంతో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యురాలు శశిరేఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చికిత్స చేశారు.

ప్రేయసిపై ప్రియుడు దాడి

ఏలూరు స్పోర్ట్స్ : ప్రియుడు ప్రేయసిపై దాడి చేసి ఆమెను గాయాలపాలు చేసిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన యువతికి వివాహమైంది. భర్తతో గొడవలు రావడంతో విడిపోయి తన ఐదేళ్ల కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఏలూరు కొత్తూరు రోడ్డు గణేషాకాలనీకి చెందిన నమ్మి హరి అనే యువకుడు రెండేళ్ల నుంచి ఆయువతితో పరిచయం పెంచుకుని వివాహేతర సంబంధాన్ని కొనసాగించాడు. అతనికి వివాహమై ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. దీంతో అతని ప్రవర్తన నచ్చక ఆమె అతనితో మాట్లాడడం మానేసి ఫోను బ్లాక్ చేసింది. ఆ యువతి జిఎన్ఎం ట్రైనింగ్ కాలేజీలో అవుతుంది. తాను ఇంటికి వెళ్లే మార్గంలో ఈనెల 14వ తేదీన ఆమెను దారిలో ఆపి పెళ్ళి చేసుకుంటానని, తన భార్య, పిల్లలను ఒదిలి వస్తానని, తనను పెళ్లి చేసుకోకపోతే ఆమెను, తల్లిదండ్రులను కూడా చంపివేస్తానని బెదిరించాడు. మంగళవారం మధ్యాహ్నం ఆమె ఒంటరిగా ఇంట్లో ఉండడంతో అకస్మాత్తుగా ఇంటికి వచ్చి ఆమెపై ప్లాస్టిక్ పైపులతో చావబాదాడు. తీవ్ర గాయాలపాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి 108 అంబులెన్సులో తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎంఎల్సిగా నమోదు చేసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంఎల్ఎ బాలరాజు

బంధంచర్లలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పాలనలో ప్రజలందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని బంధంచర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిఎం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారునికి అందజేస్తున్నామన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, ఎంపిపిడి లక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ శ్రీను రాజు, మండల యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వర రావు, ఎఎంసి డైరెక్టర్ బోట్ల విశ్వనాథం, స్థానిక సర్పంచి గుండె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐటిఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు కలెక్టరేట్ దగ్గరలోని ప్రభుత్వ జిల్లా స్థాయి శిక్షణా కేంద్రం(ప్రభుత్వ డిఎల్ టిసి/ఐటి) ఏలూరులో మూడవ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహానిస్తున్నట్లు సహాయ సంచాలకులు ఉగాది రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-2024 విద్యాసంవత్సరానికి గాను సంస్థలో సీట్ల భర్తీకి మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించబడునని తెలిపారు. విదార్థులు https://iti.ap.gov.in వెబ్సైట్ ద్వారా ఆగస్టు 27 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కాలేజీ పని వేళలలో ఆఫీస్లో సంప్రదించవచ్చున్నారు. అప్లై చేసుకున్న అభ్యర్థులు ప్రభుత్వ డిఎల్ (టిసి/ఐటి) ఏలూరులో 2023 ఆగష్ట 30వ తేదీన నిర్వహిస్తున్న కౌన్సెలింగ్నకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలియజేశారు.

బ్యాంకింగ్ సేవలు సులభతరం

ప్రజాశక్తి - మండవల్లి

ఇండియన్ బ్యాంక్ డిజిటలైజేషన్ ద్వారా బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేసిందని బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు తెలిపారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో మంగళవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన పాల్గొని ఖాతాదారులతో మాట్లాడారు. ఖాతాదారులకు అన్ని రకాల సేవలను ఇంటి వద్దకే అందించేలా డిజిటలైజేషన్ సేవలను తీసుకువచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఆన్లైన్లో కొత్త ఖాతాలు తెరవడం, వ్యవసాయ రుణాలను పునరుద్ధరించుకోవడం, రెన్యువల్, వ్యక్తిగత రుణాలు పొందడం వంటివి నిర్వహిస్తున్నామని తెలిపారు. జిఎస్టి రిటర్న్స్ వేసిన వారు రూ.5 లక్షల నుంచి 25 లక్షల వరకూ వ్యాపార రుణాలను ఇంటి వద్ద నుంచి నిమిషాలలో ఆన్లైన్ ద్వారా ఏ విధమైన హామీ లేకుండా పొందవచ్చునని ఆయన తెలిపారు. ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా ఉండేవిధంగా ఇండియన్ బ్యాంకింగ్ వ్యవస్థ ఈ ఖాతాదారుల సౌకర్యార్థమై డిజిటలైజేషన్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ఖాతాదారులు ఈ సేవలను అందిపుచ్చుకుని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యత సభ్యులు ఎల్ఐసి భాస్కరరావు, ఎబిఎన్ వెన్నా పద్మకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ కె.కవిత, క్యాషియర్ బంగారం ముడుపుదారుడు కె.అమర్నాథ్, గుడివాడ వీరరాఘవయ్య, స్వర్ణకుమారి, వరద సత్య కోనరెడ్డి, ఉషారాణి, బుర్ర రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

తహశీల్దార్కు వినతిని అందజేస్తున్న వ్యకాస నాయకులు

అసైన్డ్ భూముల వివరాలు నోటీస్ బోర్డ్లో పెట్టాలి

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామ సచివాలయాల్లోని నోటీస్ బోర్డ్లో అసైన్డ్ భూముల వివరాలను పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 54 వేల ఎకరాల అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ, పేదలకు పంపిణీ చేసేలా ఆర్డినెన్సు తీసుకు వచ్చిందన్నారు. వాటిని గ్రామ సచివాలయాల్లో (అసైన్డ్ భూముల) వివరాలు పొందుపరిచేలా చర్యలు చేపట్టాలని కోరుతూ, స్థానిక తహశీల్దార్ వంశీకి వినతిని అందజేశారు. మండలంలో భూస్వాముల పరమైన అసైన్డ్ భూములతో పాటు ప్రభుత్వ భూములను పేదలకు పంచాలన్నారు. అలాగే ఇరిగేషన్ భూముల్లో నివాసముంటున్న వారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు అద్దాని వెంకటేశ్వరరావు, పెరుమాళ్ళ సత్యన్నారాయణ, కట్టా గాంధీ, బత్తిన రఘు, ప్రజా సంఘాల కార్యకర్తలు వి.వరలక్ష్మి, పి.రాజేష్, డి.వెంకట సత్యన్నారాయణ, కె.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

బయోడీగ్రేడబుల్ బ్యాగ్లను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - చింతలపూడి

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రాంబాబు తెలిపారు. మంచి మనసుతో ఎకో భారత్ అనే ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణానికి హాని కలిగించని వస్తువులు తయారు చేస్తూ ప్రకృతిని పరిక్షించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చింతలపూడి పట్టణంలో మంగళవారం ఈ ఎకో భారత్ ప్రాజెక్టులో భాగంగా ఎకో ఫ్రెండ్లీ ప్లాస్టిక్ లిమిటెడ్తో కలిసి బయోడీగ్రేడబుల్ బ్యాగ్స్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం చేయాల్సిన కృషి గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎకో భారత్ సోషల్ ఇనిషియేటివ్లో భాగం అవుతున్నందుకు తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఎకో ఫ్రెండ్లీ ప్లాస్టిక్ లిమిటెడ్ పార్ట్నర్స్ పి.వంశీ, ఎస్.రవి మాట్లాడుతూ పర్యావరణం, సమాజానికి మంచి జరగాలన్న ఉద్దేశంతో తమ ఎకో భారత్ బయోడీగ్రేడబుల్ బ్యాగ్స్ మార్కెట్లోకి తీసుకొస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

ఎంపిటిసిల సూచనలు పాటించాలి: ఎంపిపి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించే వివిధ సభలు, సమావేశాలకు విధిగా ఎంపిటిసిలను ఆహ్వానించాలని, వారు ఇచ్చే సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని భీమడోలు ఎంపిపి కనుమాల రామయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాలకవర్గం పదవీ బాధ్యత స్వీకరించిన తర్వాత మండల పరిధిలో రూ.2.15 కోట్ల విలువ గల పనులు మంజూరయ్యాయన్నారు. వీటిలో సుమారు రూ.50 లక్షల వరకూ పనులు ప్రారంభంకాలేదని, దీంతో ఆశించిన ప్రయోజనాలకు కొంత ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. తమ పరిధిలో కేటాయించిన పనులు పూర్తికాకుండా తిరిగి నూతన పనుల కేటాయింపుకు ఎంపిటిసిలు ఒత్తిడి తేవడం సరికాదన్నారు. ఇకనైనా ప్రారంభం కానీ పనుల వివరాలు ఎంపిటిసిలు తెలియజేస్తే వాటిని ప్రాధాన్యతా క్రమంలో మరొకరికి కేటాయించి, నిధులు మురిగుపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై స్పందించిన ఎంపిపి సదరు లోపాలను సవరించుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఇదేవిధంగా ఎఎంపురం పరిధిలో అక్రమ చేపల చెరువుల నిర్మాణాలు, అనుమతులు లేకుండానే చేపల చెరువుల మరమ్మత్తులు కొనసాగటాన్ని కొందరు సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, దీనిపై స్పందించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.పాపారత్నం ఈ తరహా చర్యలు చేపట్టే వారిని గుర్తించామని, వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ మాట్లాడుతూ మండల పరిధిలో జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల కోసం 2,800 పట్టాలు మంజూరు చేశామన్నారు. కానీ గృహ నిర్మాణాలు ఆశించిన స్థాయిలో కొనసాగడం లేదని, సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మందుబాబులకు అడ్డాగా జాతీయ రహదారి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు - దిగమర్రు 165 జాతీయ రహదారి మందుబాబులకు అడ్డగా మారింది. ప్రస్తుతం ఈరహదారిలో విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నిత్యం రాత్రి సమయాల్లో ముదినేపల్లి నుంచి కానుకొల్లు వరకూ మధ్య ఉన్న గ్రామాలకు చెందిన మందుబాబులు రాత్రి 7 నుంచి 11 వరకూ మద్యం సేవిస్తూ కొత్త రహదారిపై హల్చల్ చేస్తున్నారు. ఈరహదారిలో కల్వర్టులు, కొత్త రహదారిలో బైక్లు, ఇతర వాహనాలు నిలుపుదల చేసి, మద్యం సేవిస్తూ రాత్రి పొద్దుపొయ్యే వరకూ కాలం గడుపుతున్నారు. ఈతంతు అంతా కొత్త రహదారిలో జరుగుతోంది. పక్కనే ఉన్న పాత రహదారిలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మద్యం మత్తులో కొందరు మందుబాబులు వాహనాలకు పాత రహదారిపైకి వెళ్లి, వాహనాలకు అడ్డుపడుతూ హడావిడి చేస్తున్నారు. దీంతో రహదారిలో తరచూ మందుబాబుల చేష్టలతో ట్రాఫిక్కు అంతరాయం కలుగుతుందని పలువురు చెబుతున్నారు. మందుబాబుల వికృత చేష్టలతో పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ముదినేపల్లి నుంచి కానుకొల్లు వరకూ కొత్త రహదారి పనులు పూర్తి కావడంతో ఈ రహదారిలో మందుబాబులు సిటింగ్లు వేస్తున్నారు. ఈ రహదారిలో మందుబాబులు చేసే చేష్టలకు అడ్డుకట్ట వేయాలని పలువురు మహిళలు పోలీసులను కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పనులలో అవకతవకలు ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదులను ఎపిడి ఎల్.శ్రీనివాసరావు పరిశీలించారు. మంగళవారం మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన బి.జయశ్రీ ఉపాధి హామీ చట్టం పనులలో పనికి వెళ్లకుండా, వెళ్లినట్లు మస్టర్లలో హాజరు వేసుకుని నగదు డ్రా చేసుకుంటున్నారని స్పందనలో ఫిర్యాదు చేశారు. ఫిల్డ్ అసిస్టెంట్ బి.కుమారి, ఎపిఒ టి.రోస్ లీలా, ఇసి జ.జయప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ హెచ్.రవికుమార్, మెట్లతో క్షేత్రస్థాయిలో 19 మంది కూలీలను విచారించగా, వారిలో ఒకరు జాబ్ కార్డుపై మనవడు పనికి వెళ్లినట్లు విచారణలో తేలింది. అతని వద్ద నుంచి రూ.2,800 రికవరీ ఎపిడి రాసారు. దీనిపై ఎపిడి, పిడికి రిపోర్టు చేసినట్లు ఎపిఒ తెలిపారు.

'మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర నాయకులు తెలిపారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోలోని అంశాలను మంగళవారం టి.నరసాపురంలో నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్రెడ్డి పాలనలో రాష్ట్రంలో మహిళకు భద్రత కరువైందన్నారు. ఆర్థిక ఎదుగుదల లేదని వాపోయారు. టిడిపి అధికారంలోకి రాగానే మహిళలు ఎవరి మీద ఆధార పడకుండా, వారంతట వారు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తామన్నారు. 18 నుంచి 59 సంవత్సరాలు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 అందజేస్తామన్నారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికీ సంవత్సరానికి రూ.15వేలు అందిస్తామని, ఉచితంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలీండర్లు, ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. మహిళల రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పథకాలు అన్ని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవి, ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకట రమణ, కుంజం సుభాషిణి, పెండ్యాల రమాదేవి, జారం చాందిని, ఆకుల అరుణ, జోనుబోయిన సోంబాబు, పెద్దిన చంద్రశేఖర్, కొల్లి రమేష్, పాపాచార్యుల వీరేశలింగం, పెద్దిన సత్యనారాయణ, పేరం రాంబాబు, గందం ముత్తయ్య పాల్గొన్నారు.

ఉంగుటూరు : అక్కుపల్లి గోకవరంలో టిడిపి ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్లస్టర్ ఇంఛార్జి సింగూలూరి రామకృష్ణ, ఈగలపాటి పకీర్ చౌదరి, మన్నే పోతురాజు, కట్ట నాగరాజు, పులిపే సుబ్బారావు, బొడ్డు శాంతకుమారి, మన్నే సత్యవాణి, మరపట్ల రామతులసమ్మ, కడియాల రవిశంకర్, ఇమ్మని గంగాధర్, నేకూరి ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

బ్లడ్ బ్యాంక్ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సినీనటులు చిరంజీవి సేవలు ఇతరులకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమడోలులో చిరంజీవి అభిమానులు, జనసేన కార్యకర్తల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా కేకును కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా పేదలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పంపిణీ చేయడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను స్వీకరించాలని మొక్కలను తీసుకున్న వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పత్తి మదన్, పూజారి రాకేష్, సాయి దుర్గాదేవి పాల్గొన్నారు.



భీమడోలులో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న అభిమానులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 22 యూనిట్ల రక్తం సేకరణ

జంగారెడ్డిగూడెం : సినీ హీరో చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణ చిరంజీవి యువత గౌరవ అధ్యక్షులు మద్దాల ప్రసాద్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్లో నిర్వహించిన మెగా బ్లడ్ క్యాంప్ను నిర్వాహకులు దాకరపు కృష్ణ, అచ్యుత శ్రీనివాసరావు, రొంగల ప్రసాద్, బవిరిసెట్టి తిలక్, వలవల తాతాజీ, ఉక్కుర్తి సీతారామ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్దాల ప్రసాద్ మాట్లాడుతూ రక్త దాతలను పీసుపాటి రామలక్ష్మి, షేక్ హసీనా, జ్యోతిలు శాలువాలతో సత్కరించారని తెలిపారు. రక్తదాన శిబిరంలో 22 యూనిట్ల రక్తంను సేకరించినట్లు తెలిపారు. రాజకీయ ప్రముఖులు రాఘవ రాజు ఆదివిష్ణు తన పుట్టిన రోజు సందర్భంగా చిరంజీవి అభిమానిగా వచ్చి రక్త దానం చేశారని తెలిపారు. అనంతరం అమ్మ, నాన్న వికలాంగుల సేవా కేంద్రంలో చింతల నాని, కొమ్మిరెడ్డి సత్యన్నారాయణ అభిమానుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వచించారు. ఈ కార్యక్రమాలలో చిరంజీవి యువత సభ్యులు శింగంసెట్టి సత్తిరాజు, బోస్, మాల్లిపూడి రవి, మాచినీడి శ్రీను, కొల్లిపర నారాయణ, వసంతటి మంగ రాజు, ఉజ్జీన శ్రీను, శేషు, పెదవేగి రాంబాబు పాల్గొన్నారు.

చింతలపూడి : సినీనటుగా కాకుండా రక్తదానం, నేత్రదానం వంటి సేవా కార్యక్రమాల్లో ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేసుకున్న వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని మెగాస్టార్ ఫ్యాన్స్ అసోషియేషన్ జిల్లా అధికార ప్రతినిధి తుమ్ము విజయ్కుమార్ తెలిపారు. మండలంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమకి పెద్దగా ఉంటూ, ఎవరకి ఏ కష్టం వచ్చినా వెంటనే వారిని ఆదుకుంటూ తన మానవత్వంని నిరూపించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు కోప్పేర్ల నాగరాజు, సూర్య, అభిమానులు పాల్గొన్నారు.

విచారిస్తున్న డిఎల్పిఒ..

స్పందనలో ఫిర్యాదుపై విచారణ : డిఎల్పిఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గతంలో పంచాయతీ పరిధిలో చేసిన పనులకు స్పందన కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఫిర్యాదు పెట్టాడు. డిఎల్పిఒ మహ్మద్ రజాఉల్లా విచారణ నిమిత్తం మంగళవారం సాయంత్రం పంచాయతీ కార్యాలయానికి విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా గత రెండు సంవత్సరాల క్రితం పంచాయతీలో నీటి పనుల నిమిత్తం చేసిన బిల్లులు రావాల్సి ఉందని, వాటిని నేటికీ చెల్లించకపోవడంతో శ్రీనివాస్ అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీలోని పనుల వివరాల రికార్డ్లను పరిశీలించారు. అనంతరం ఆయనకు కొంత మొత్తం నగదు రావాల్సి వుందని, ఆ బకాయిలు త్వరలోనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్దిలో యాత్రికుల రద్దీ

ఆదాయం రూ.1,46,097

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి యాత్రికుల రద్దీ పెరిగింది. మంగళవారం ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఈ క్రమంలో 800 మంది యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. ప్రసాద అమ్మకాలు, వాహన పూజ, అన్నదాన విరాళాలు కానుకల రూపంలో రూ.1,46, 097 ఒక్కరోజు ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మాళ్ళీడి మోహన్కృష్ణ, పర్యవేక్షకులు కోరగంటి రంగారావులు సేవలందించారని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్పర్సన్ సరిత విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

టిడిపి యువనేత నారా లోకేష్ పాదయాత్రతో జగన్ వెన్నులో వణుకు ప్రారంభమైందని ఏలూరు జిల్లా టిడిపి ఇంఛార్జి గన్ని వీరాంజనేయులు అన్నారు. నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన మీర్జాపురం గ్రామంలోకి నారా లోకేష్ పర్యటన కొనసాగుతున్నట్లు తెలిపారు. టిడిపి శ్రేణులు ఐక్యంగా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గన్నవరం తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - కలిదిండి

గన్నవరంలోని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బహిరంగ సభకు స్థానిక నాయకులు, అభిమానులు తరలివెళ్లారు. తొలుత స్థానిక ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్లలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, ఎస్ఆర్పి అగ్రహారం, వెంకటాపురం సర్పంచిలు తలారి వెంకట స్వామి, గూడవల్లి శ్రీనివాసరావు, నాయకులు దున్న భోగేశ్వరరావు, రాజనాల మణికంఠ, శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - ముసునూరు

సిపిఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ముసునూరు గ్రామంలోని మండపం సెంటర్ వద్ద బత్తుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 24వ తేదీన నూజివీడులోని సిపిఐ బస్సుయాత్రకు మండలంలోని 16 గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొవాలన్నారు. అటవీ బంజరు భూములు సమస్యలపై ప్రభుత్వంపై పోరాడి, సాధించుకోవడానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జెల్లి విల్సన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, వ్యవసాయ ప్రధాన కార్యదర్శి సిపిఐ(ఎం) వి.వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ డి.హరనాథ్, రాష్ట్ర వామపక్ష నాయకులు పాల్గొంటారని తెలిపారు. కావున మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సవరణ దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, సీతారామపురం వాస్తవ్యులు చిన్ని సాంబశివరావు గారి కుమారుడు అయిన చిన్ని సుబ్బారావు పేరన ఈదర గ్రామంలోని ఆర్.యస్.నెం. 780లో య.2-00 సెంట్లు భూమికి సంబంధించిన సవరణ దస్తావేజు (నెం.4544/2019) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చగలరు.

చిన్ని సుబ్బారావు
తండ్రి: సాంబశివరావు, సీతారామపురం గ్రామం,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 99483 23537